సాక్షి
కర్నూలు
సోమవారం । 26 ఫిబ్రవరి । 2024



మల్లన్న సేవలో పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆదివారం తమిళనాడు మయిలడుతురైకు చెందిన ధర్మపురం ఆధీన పీఠాధిపతి పరమాచార్య స్వామిగల్ దర్శించుకున్నారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన జొన్నలగడ్డ శ్రీకాంత్ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతను జ్ఞాపికతో సత్కరించారు.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్య కళావేదికపై ఆదివారం జడ్చర్లకు చెందిన అభినయ కూచిపూడి కళానిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.

టీజీ..గూడుపుఠాణి!



బి.తాండ్రపాడు సమీపంలో అక్రమంగా వేసిన గుడారాలు

- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుయుక్తులు
- పేదలకు ఇంటి స్థలాల పేరుతో ప్రలోభాలు
- ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించిన వైనం
- సీపీఐతో కలసి కథ నడిపిస్తున్న టీజీ వెంకటేష్, భరత్

వరుసగా రెండు సార్లు పరాభవం.. ఈ సారి గెలుపు కష్టమేనన్న సంకేతాలు.. ఈ నేపథ్యంలో కర్నూలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్ తన తండ్రి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌తో కలిసి సరికొత్త డ్రామాకు తెర లేపారు. ఖాళీ స్థలాల్లో పేదలతో గుడారాలు వేయిస్తున్నారు. ఇందుకు కమ్యూనిస్టు నాయకులను వాడుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తోంది. అయితే ఎన్నికల్లో లబ్ధి పొందాలనే లక్ష్యంతో టీజీ చేస్తున్న 'గూడు'పుఠాణిని చూపి కర్నూలు నగర ప్రజలు నవ్వుకుంటున్నారు.

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని సులభతరం చేసింది. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చింది. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసలుబాటు కల్పించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ 90 రోజుల్లో ఇంటి పట్టా అందిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూలు నగరంలో పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన 23 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చింది. నగర శివారులో ప్రత్యేకంగా జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. ఇంటి స్థలం లేదని, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఏనాడూ నిరసనలు జరగలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ప్రజల్లో పలుచన చేయాలనే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీ నేతలు సరికొత్త కుట్ర తెర లేపారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లబ్ధిపొందేందుకు ఇళ్ల స్థలాల విషయం తెరపైకి తెచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్, ఆయన తండ్రి మాజీ రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్.. సీపీఐని ముందు పెట్టి నగరంలోని పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామంటూ ప్రచారం చేశారు. కూలీలతో పనులు మాన్పించి పాత చీరలు, పాత కాగితం పట్టలతో ఖాళీ స్థలాల్లో గుడారాలు వేయించారు. కర్నూలు నగరంలో నందికొట్కూరు రోడ్డులోని నీలకంఠేశ్వర స్వామి మాన్యం భూముల్లో గుడిసెలు వేయించడం వివాదానికి దారి తీసింది. తన కుమారుడు టీజీ భరత్ గెలిచాక ఆ వివాదాలను తొలగిస్తామని టీజీ వెంకటేష్ ఎర్రజెండా నేతలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విమర్శలు ఉన్నాయి.



ఆక్రమిత స్థలంలో సీపీఐ జెండాలు

ఇళ్ల స్థలాల పేరుతో డబ్బు వసూలు

బి.తాండ్రపాడు సమీపంలోని భూముల్లో గుడారాలు వేసుకున్న వారి నుంచి సీపీఐకి చెందిన ఓ నాయకుడు, ఆ పార్టీ అనుబంధ విభాగానికి నాయకత్వం వహిస్తున్న మరో వ్యక్తి డబ్బు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరి నుంచి రూ.2 వేలకుపైగా వసూలు చేశారని కమ్యూనిస్టు పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. ఈ విషయం ఆ పార్టీ జిల్లా నాయకత్వానికి కూడా తెలియదని సమాచారం.

వెంటాడుతున్న ఓటమి భయం

విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది. కర్నూలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేయడంతో ప్రజల్లో మంచి స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో మరోసారి ఎన్నికల్లో తన కుమారుడికి ఓటమి తప్పదనే భయం టీజీ వెంకటేష్‌లో మొదలైంది. తాను బీజేపీలో ఉంటూ..టీడీపీలో ఉన్న టీజీ భరత్‌ను ఎన్నికల్లో ఎలాగైనా ఈసారి గెలిపించాలనే 'గుడారాల' ఎత్తుగడ వేశారు. టీజీ వెంకటేష్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ నగర వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశారనే విమర్శలు ఉన్నాయి. కొంత మంది అయిన వారికి మాత్రమే ఇప్పించి అర్హులకు అన్యాయం చేశారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఏ రోజూ పేదల ఇంటి కలను నేరవేర్చని టీజీ తన కుమారుడిని గెలిపించుకునేందుకు కమ్యూనిస్టు పార్టీని పావుగా వాడుకుంటున్నారనే విమర్శలు సైతం వస్తున్నాయి.

రెజ్యూమ్డ్ భూముల్లో పట్టాలు ఇవ్వడం అసాధ్యం

కర్నూలు రూరల్ మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన 341/1, 341/2, 342/1ఎ, 342/2ఎ, 342/2బి, 343/1, 343/2, 343/3,344/1,344/2/344/3, 345/2 సర్వే నంబర్లలో 34.66 ఎకరాల భూమి ఉంది. ఈ భూముల్లో మూడు దశబ్దాల క్రితం కొంత మంది చేనేతలకు పట్టాలు ఇచ్చారు. ఆ తరువాత 2007లో ఆ భూముల్లో పట్టాలు ఇచ్చిన వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించి ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని తీసుకుంది. ఈ భూములను రెజ్యూమ్డ్ చేసుకుంది. వీటిలో ఎవరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదని రెవెన్యూ చట్టాలు చెబుతున్నాయి. ఈ విషయం తెలిసి కూడా రెజ్యూమ్డ్ భూముల్లో నిరుపేదల చేత గుడారాలు వేయించారు. వీరితో నిత్యం సమావేశాలు నిర్వహిస్తున్నారు. రోజూ రూ. 300 నుంచి రూ. 500 కూలి వదులుకొని పేదలు రాత్రీ పగలు అక్కడే ఉంటున్నారు. గుడారాలు వేసుకున్న వారికి టీజీ భరత్ భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు అక్కడి వారు చర్చించుకుంటున్నారు. విషయం తెలిసి రెవెన్యూ అధికారులు పోలీసులతో అక్కడికి వెళ్లి గుడారాలు వేసుకున్న వారితో మాట్లాడారు. వాటిని తొలగించాలని, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఇంటి స్థలం ఇస్తుందని హామీనిచ్చారు. ఇది జరిగి రెండు వారాలు అయినా ఏ ఒక్కరూ దరఖాస్తు చేసుకోలేదని రెవెన్యూ అధికారవర్గాలు చెబుతున్నాయి.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చాం

బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన భూముల్లో కొంత మంది గుడారాలు వేసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ గ్రామ వీఆర్‌ఓతో కలిసి అక్కడికి వెళ్లాం. భూములు ప్రభుత్వ కార్యాలయాలకు రెజ్యూమ్డ్ చేసుకున్నవని, ఇక్కడ ఎవరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సాధ్యం కాదని చెప్పాం. వెంటనే ఖాళీ చేయాలని కోరాం. ఇళ్ల స్థలాలు లేకపోతే తగిన ఆధారాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. నవరత్నాల్లో భాగంగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చాం.

– రామాంజులు నాయక్, కర్నూలు రూరల్ తహసీల్దార్

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన



ఆదోని రైల్వే స్టేషన్

ఆదోని సెంట్రల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారని స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 72 స్టేషన్లను గుర్తించగా గుంతకల్ డివిజన్ పరిధిలో 15 ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో ఆదోని రైల్వే స్టేషన్ ఉందని, రూ.8 కోట్లతో ప్లాట్‌ఫామ్స్, లిఫ్ట్, రెస్ట్ రూమ్స్ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీలో ముస్లింలకు అన్యాయం




మాట్లాడుతున్న షేక్ మహబూబ్‌బాషా

ఆదోనిరూరల్: టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు కుదుర్చుకొని ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం చేశాయని ముస్లిం మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం ఆదోనిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రకటించిన 94 మంది అభ్యర్థుల్లో ఒక్కరే ముస్లిం ఉన్నారన్నారు. ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత నిచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈనెల 29న ఆదోని పట్టణంలో ముస్లిం మైనార్టీల గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభను విజయవంతం చేసేందుకు ముస్లింలు భారీగా తరలి రావాలన్నారు.

పెద్దాసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కాటసాని



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

కర్నూలు (టౌన్): ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 23.75 కోట్లతో నిర్మించనున్న 50 బెడ్ల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ఆదివారం వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ నుంచి ఈ కార్యక్రమానికి ప్రధాని శ్రీకారం చుట్టారు. స్థానిక వైద్య కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మిషన్‌లో భాగంగా పెద్దాసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ బ్లాక్ ద్వారా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి తక్షణ ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్యానికి పెద్ద పీటవేశాయన్నారు. కర్నూలు పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తుందన్నారు. అనంతరం క్రిటికల్ కేర్ బ్లాక్‌కు సంబంధించిన పైలాన్‌ను కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటాసాని రాంభూపాల్ రెడ్డి, వైద్యాధికారులు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎంఎస్ ఐడీసీ ఎస్ ఈ. రమేష్‌రెడ్డి, ఈఈ శివకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు తగిన గుర్తింపు

- ఎమ్మిగనూరులో మళ్లీ జెండా ఎగురవేద్దాం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీలో బీసీలకు తగిన గుర్తింపు లభిస్తోందని ఆ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే కుర్ణికులానికి చెందిన మాజీ ఎంపీ బుట్టారేణుకకు ఎమ్మిగనూరు నియోజకవర్గ బాధ్యతలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మిగనూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లను పార్టీ సమన్వయకర్త బుట్టారేణుకతో పరిచయ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో పేదలకు ఎలాంటి మేలు చేకూరలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చే హామీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాభవం తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా లబ్ధిదారులకు ఇంటి వద్దనే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుపై నడకేనన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

భారీ మెజారిటీ తెప్పిద్దాం

నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా ఐక్యతతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో బుట్టారేణుకను 50 వేల భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేద్దామని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరు మండలం నుంచి మంచి మెజారిటీ ఇచ్చేందుకు శ్రమించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అవినీతికి తావివ్వకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పనిచేస్తా

నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, పార్టీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్నికల్లోను, ఎన్నికల తరువాత పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ సమష్టి కృషితో పార్టీ విజయానికి తోడ్పాటునందించాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎంపీపీ కేశన్న, పార్టీ సీనియర్ నాయకులు దైవందిన్నె జానకిరామిరెడ్డి, భీమిరెడ్డి ప్రసంగించారు. పార్టీ నాయకులు బుట్టా నీలకంఠ, పోలయ్య, భాస్కర్, సర్పంచులు లక్ష్మన్న, రంగస్వామి, వినయ్‌కుమార్‌రెడ్డి, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

బతికున్నానంటే జగనన్న చలువే

మాది నిరుపేద కుటుంబం. ఉన్న నాలుగెకరాలలో వ్యవసాయ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గతేడాది జనవరిలో జ్వరం వస్తే కర్నూలు ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నా. అక్కడ కిడ్నీలు పని చేయడం లేదని వైద్యులు చెప్పారు. ఖర్చుతో కూడిన వైద్యం ఎలా అని బాధపడుతున్న సమయంలో ఆరోగ్య శ్రీ పథకం ఆదుకుంది. ఉచితంగా ఆపరేషన్ చేశారు. వారానికి రెండుసార్లు కర్నూలులో ఉచితంగా డయాలసిస్ చేయించు కుంటున్నా. ఆస్పత్రికి వెళ్లేందుకు కూడా ఇబ్బంది లేకుండా 108 అంబులెన్స్ ఉచితంగా తీసుకెళుతోంది. ఎలాంటి శ్రమ లేకుండా ఆస్పత్రి వాళ్ల దరఖాస్తు ఆధారంగానే పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా రూ.10వేలు పింఛన్ ఇంటికే వచ్చి ఇస్తున్నారు. ఆ పింఛనే లేకుంటే చాలా ఇబ్బందులు పడేవాన్ని. ఆరోగ్య శ్రీ పథకం లేకుంటే లక్షలు అప్పు అయ్యేది. అంత డబ్బు పెట్టుకునే స్తోమత మాకు లేదు. ఈ రోజు ఊపిరితో ఉన్నానంటే అది జగనన్న చలువే. ఉచిత వైద్యంతో పాటు ఇంటికే పింఛన్ పంపిస్తున్న సీఎం వైఎస్ జగన్ సాయాన్ని మరువలేను.



– తలారి సుధాకర్, చెన్నంపల్లి, తుగ్గలి మండలం

ఐదేళ్లలో రూ. 5 లక్షల లబ్ధి



ఐదేళ్ల కాలంలో మా కుటుంబానికి రూ. 5 లక్షల లబ్ధి చేకూరింది. నా తమ్ముడు చిన్న ఎర్రిస్వామికి ప్రతి ఏడాది రైతు భరోసా నిధులు వస్తున్నాయి. నేను తుపాన్ వాహనం నడుపుతున్నా, వాహన మిత్ర కింద ఇప్పటి వరకు నాలుగు సార్లు డబ్బులు వచ్చాయి. టీడీపీ హయాంలో ఇల్లు నిర్మించుకుంటానని ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల బిల్లు ఇచ్చింది. అమ్మ ఈరమ్మకు వైఎస్సార్ చేయూత కింద ఆర్థిక సాయం అందుతోంది. కుమార్తె నివేదినికి మూడేళ్ల నుంచి అమ్మఒడి పథకం వస్తోంది. తండ్రి వీరభద్రప్పకు పింఛన్ ఇస్తున్నారు. ఇంతకంటే మాకేం కావాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంది.

– ఎర్రిస్వామి, వల్లూరు గ్రామం, కౌతాళం మండలం

ప్రశాంతంగా గ్రూపు- 2 ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలో 126 కేంద్రాల్లో నిర్వహణ
- 81.93 శాతం మంది అభ్యర్థుల హాజరు

కర్నూలు(సెంట్రల్): గ్రూపు–2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోలేదు. కర్నూలు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల్లో ఏర్పాటు చేసిన 126 కేంద్రాల్లో గ్రూపు–2 ప్రిలిమినరీ పరీక్షను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. మొత్తం 36,816 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 30,163 మంది హాజరవ్వగా 6,653 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో 81.93 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ జిల్లా కోఆర్డినేట్ ఆఫీసర్‌గా నియమించిన జేసీ నారపురెడ్డి మౌర్య తెల్లవారుజామునుంచే అధికారులను సమన్వయం చేశారు. 34 రూట్లలో కలెక్టరేట్ ట్రెజరీ నుంచి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ సీట్లను అధికారులు తీసుకెళ్లి కేంద్రాలకు భారీ బందోబస్తు మధ్య చేర్చారు. పరీక్ష ముగిసిన వెంటనే అదే రూట్లలో జవాబు పత్రాలు, పూర్తి చేసిన ఓఎంఆర్ సీట్లను కలెక్టరేట్ లోని ట్రెజరీకి బందోబస్తు మధ్య చేర్చారు. కర్నూలు నగరంలోని పరీక్ష కేంద్రాలను డీఆర్వో కె.మధుసూదన్‌రావు పరిశీలించారు. పరీక్ష నిర్వహణను సీసీకెమెరాల ద్వారా ఏపీపీఎస్సీ విజయవాడలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకుండా నిషేధించారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్కును ఏర్పాటు చేయడంతో అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తమైంది.



పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరి నిల్చున్న అభ్యర్థులు



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న దృశ్యం

ఆశలు ఆవిరి..



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిత

గ్రూపు–2 పరీక్ష రాయడానికి వెళ్తున్న ఓ అభ్యర్థి ఆశలు ఆవిరయ్యాయి. రోడ్డు ప్రమాదంలో ఆమె గాయపడ్డారు. నగరంలోని స్టాంటన్‌పురానికి చెందిన మహిత పరీక్ష రాయడానికి వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆమె కాలు విరగడంతో పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సిన సమయంలో ఆసుపత్రిపాలైంది. ఆమెకు కర్నూలులోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్న తరుణంలో రోడ్డుప్రమాదం జరిగింది. దీంతో ఆమె కన్నీరుమున్నీరైంది.

ఇళ్ల నిర్మాణాలకు రూ.441.85 కోట్ల చెల్లింపులు

- జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి

కర్నూలు(అర్బన్): జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.441.85 కోట్లను చెల్లించిందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ ఎం. సిద్ధలింగమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. జిల్లాలో మొత్తం 303 లేఅవుట్లలో 40,815 గృహాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 16,563 గృహాలు పూర్తయ్యాయన్నారు. రూఫ్ కాస్ట్ దశలో 2,733, రూఫ్ లెవెల్‌లో 2,599 గృహాలు ఉండగా, మిగిలినవి వేర్వేరు దశల్లో కొనసాగుతున్నాయన్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకు ముడి సరుకుతో (సిమెంట్, ఇసుక, స్టీల్, డోర్ ఫ్రేమ్స్, విండో ఫ్రేమ్స్, డోర్ షట్టర్స్, ఎలక్ట్రికల్ ఐటమ్స్ తదితరాలు) కలిపి మొత్తం రూ.441.85 కోట్లను లబ్ధిదారులకు చెల్లించామన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని 36873 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం రూ.129.05 కోట్లను రుణంగా అందించామన్నారు. పీఎంఏవై - వైఎస్సార్ గ్రామీణ్ కింద 12,583 గృహాలు మంజూరు కాగా, 1338 గృహాలు పూర్తయ్యాయన్నారు. ఈ నిర్మాణాలకు కూడా ఇప్పటి వరకు రూ.40.85 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలపై ఎన్నికల కోడ్ ప్రభావం ఉండబోదన్నారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. థర్డ్ ఆప్షన్ కింద కాంట్రాక్టర్లు నిర్ణీత సమయంలో గృహాలను పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన ఐదేళ్ల మిషన్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కానుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ రైతు అదృశ్యం


అదృశ్యమైన రైతు గడ్డమీది వెంకట్

వెల్దుర్తి(కృష్ణగిరి): తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా బాదంపేటకు చెందిన 44ఏళ్ల రైతు గడ్డమీది వెంకట్.. వెల్దుర్తి మండల పరిధిలోని మదార్‌పురం వద్ద గల దాబా వద్ద అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణకు చెందిన రైతులు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీపై బర్రెలను తమిళనాడు ప్రాంతం నుంచి కొనుగోలు చేసి లారీలో తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున మదార్‌పురం డాబా వద్ద లారీ ఆగగా అందరు దిగి టీ తాగి బయలదేర చూశారు. ఇంతలో వారిలోని రైతు గడ్డమీది వెంకట్ కనబడలేదు. చాలా సమయం ఎదురు చూసి, చుట్టపక్కల ప్రాంతాలు వెతికి కనబడక పోవడంతో వెల్దుర్తి పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన రైతు గడ్డమీది వెంకట్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చూస్తూ, కనబడిన వారు తన నంబరు 9121101118కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


మృతి చెందిన హసీనా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఎస్‌ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. బనగానపల్లె మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన షేక్ ఉసేన్‌సాకు పదేళ్ల క్రితం పాణ్యం మండలం కొణిదేడు గ్రామానికి చెందిన షేక్ హసీనా(25)తో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె సంతాన. భార్య, భర్తలు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కూలీ పనుల నిమిత్తం హసీనాతో పాటు ఎనిమిది కూలీలు మిరప కోత పనులకు కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నెకు ఆటోలో బయలుదేరారు. గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో హసీనా తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

27న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 27న జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు కుబేర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 85 కేజీలలోపు బరువు ఉన్న క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9966998818 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తుల రద్దీ దృష్ట్యా ఉచిత, రూ.200, రూ.500 క్యూలైన్లు
- శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్
- ఉచిత కంపార్ట్‌మెంట్లలో 10వేల మంది భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు
- భక్తులకు నిరంతరం తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం పంపిణీ


శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్


ఉచిత దర్శన క్యూలైన్లు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరిలో అత్యంత వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలిరానున్నారు. శ్రీశైల మల్లన్నను కనులారా చూసి, మనసారా దర్శించుకుని, బ్రహ్మోత్సవాలను తిలకించి పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహంతో ఆనందంతో భక్తులు తిరుగు పయనమవుతారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచే శ్రీగిరికి భక్తుల తాకిడి పెరుగుతుంది. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా దేవస్థాన ఈఓ డి. పెద్దిరాజు ఇప్పటికే పలుమార్లు సమీక్ష సమావేశాలను సైతం ఏర్పాటు చేసి ఆయా విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి బ్రహ్మోత్సవ సమన్వయ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల సూచన మేరకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నయ్యారు.

భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు విచ్చేసే భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఇందుకోసం మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు సాధారణ భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. అలాగే జ్యోతిర్ముడి కలిగి ఉన్న శివస్వాములకు మార్చి1 నుంచి 5వ తేదీ వరకు మాత్రమే విడతల వారీగా స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఉచిత దర్శనానికి 17 కంపార్ట్‌మెంట్లు

శ్రీశైల మల్లన్నను సామాన్య భక్తులు ఉచితంగా దర్శనం చేసుకునేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. దేవస్థానంలో ఉచిత క్యూలైన్ భక్తులు వేచి ఉండేందుకు 17 కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో 7,200 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది. అలాగే క్యూలైన్లలో నిలబడి వేచి ఉండేందుకు 2,900మందికి అవకాశం ఉంది. మొత్తానికి ఉచిత క్యూకంపార్ట్‌మెంట్లు, క్యూలైన్ల ద్వారా 10,100 మంది భక్తులు దర్శనం చేసుకునే వీలు ఉంది.

శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్లు:

ఉచిత దర్శనంతో పాటు దేవస్థానం శీఘ్ర (రూ.200), అతిశీఘ్ర (రూ.500) దర్శనం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా, కరెంట్ బుకింగ్ ద్వారా అందుబాటులో ఉంచింది. శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండేందుకు 8 కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఆయా కంపార్ట్‌మెంట్లలో సుమారు 3,360 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది.

పాదయాత్ర భక్తులకు మెరుగైన వసతులు


పెద్దచెరువు ప్రాంతం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం నాగలూటి, పెద్దచెరువు ప్రాంతాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మంచినీటి సదుపాయం, అన్నదానం, మార్గసూచికల ఏర్పాటు, వైద్యశిబిరాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నాగలూటి వద్ద గల కోనేరును శుభ్రపరచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అటవీశాఖ సహకారంతో నాగలూటి వద్ద భక్తులు సేద తీరేందుకు వీలుగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టామన్నారు. పెద్దచెరువు వద్ద గత సంవత్సరం కంటే అదనంగా చలువ పందిళ్లు వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వెంకటాపురం, పెద్దచెరువు, దాయర్లగుంటలలో గతంలో కంటే అధికసంఖ్యలో తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. గత సంవత్సరం కంటే 20శాతం మేర అధిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. నాగలూటి, పెద్దచెరువు ప్రాంతాలకు అధికసంఖ్యలో వాటర్ ట్యాంకర్లను పంపాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు. ఈఓ వెంట దేవస్థాన ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ రంగప్రసాద్, అటవీశాఖ రేంజ్ అధికారి దొరస్వామి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూ

బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లుల కోసం దేవస్థానం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసింది. మొత్తం నాలుగు క్యూలైన్లు ఉండగా ఆయా క్యూలైన్లలో 1,200 మంది భక్తులు వేచిఉండే అవకాశం ఉంది. అలాగే ఆలయంలో లోపల 1,700 మంది భక్తులు క్యూలైన్లలో 650 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది. మొత్తం 4,010 మంది భక్తులు శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉంది. పట్టే నాలుగు క్యూలైన్లు ఉన్నాయి.

శివస్వాములకు నాలుగు కంపార్ట్‌మెంట్లు..

శివస్వాములకు చంద్రవతి కల్యాణ మండపంలో ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. చంద్రవతి కల్యాణ మండపంలో మొత్తం 4 కంపార్ట్‌మెంట్లలో 6,700 మంది భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. అలాగే క్యూలైన్లలో 3వేల మంది భక్తులు వేచి ఉండేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉచిత, రూ.200, రూ.500 క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరం తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేస్తారు.

అందరూ ధర్మ మార్గంలో నడవాలి

- కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతీ స్వామి


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

మహానంది: ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడవాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. విజయయాత్రలో భాగంగా మహానంది క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని, పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో ఆదివారం రాత్రి అనుగ్రహ భాషణం నిర్వహించారు. హిందూ ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ధర్మం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ అధర్మాన్ని వీడి సత్యమార్గంలో నడవాలని కాంక్షించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలన్నారు. . హిందూ ధర్మంలో భగవంతుడి ఆరాధన ఎంతో కీలకమని, ప్రతి ఆలయంలో నిత్యం పూజలు జరుగుతుంటే ఆ గ్రామం, ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. మహానంది ఆలయం ఎంతో మహిమాన్వితమైనదని అన్నారు. స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామి పశ్చిమాభిముఖంగా ఉంటూ భక్తుల కోరికలు నెరవేరుస్తున్నారన్నారు. అనంతరం రాత్రి స్థానిక అభిషేక మండపంలో శ్రీ శారదా సమేత శ్రీ చంద్రమౌళీశ్వర పూజలు నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, తదితరులు పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

మండపానికి నేడు భూమిపూజ

మహానందిలో స్వామివారి నిశ్చితార్థ మండపం నిర్మాణానికి సోమవారం పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి భూమి పూజ చేయనున్నారు. పురాతనమైన మండపం తొలగించిన విషయం తెలిసిందే. దాని స్థానంలో నూతనంగా నిర్మించనున్న మండప నిర్మాణానికి భూమి పూజ ఉంటుందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

సాంకేతికతపై రైతులకు అవగాహన పెంచండి

- ఇన్‌పుట్ డీలర్లకు రిటైర్డ్ డీడీఏ సూచనలు


మాట్లాడుతున్న రిటైర్డ్ డీడీఏ భగవత్ స్వరూప్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని, దీనిని రైతుల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ రిటైర్డ్ డీడీఏ భగవత్ స్వరూప్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రోత్సహించాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను ఆకుమచ్చ తెగులు, పొగాకు లద్దెపురుగు ఆశించిందని, నివారణకు పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రిటైర్డ్ జేడీఏ, దేశీ కోర్సు సమన్వయకర్త జయచంద్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

కోళ్ల రక్త నమూనాల సేకరణ


రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలో శ్యాంపుల్స్ సేకరిస్తున్న పశువైద్య సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): ప్రమాదకరమైన బర్డ్‌ఫ్లూ వైరస్ నెల్లూరు జిల్లాలో వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు కోళ్లు, బాతులు, ఇతర పక్షుల రక్తనమూనాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 40 రక్త నమూనాలు సేకరించాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 30 శ్యాంపుల్స్ సేకరించారు. మిడుతూరు మండలంలోని రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలో పశుసంవర్ధకశాఖ అధికారులు పక్షుల నుంచి 24 శ్యాంపుల్స్ సేకరించారు. నంద్యాలలో బాతుల నుంచి, ఆలూరు, కర్నూలు రూరల్ మండలంలో కోళ్లలో రక్త నమూనాలు సేకరించారు. రిజర్వాయర్లకు వలస పక్షులు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లోని కోళ్ల నుంచి కూడా రక్త నమూనాలు సేకరిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో వెలుగోడు రిజర్వాయర్, కర్నూలు శివారులోని గార్గేయపురం చెరువు సమీపంలోని కోళ్ల పారాల్లో శ్యాంపుల్స్ సేకరించారు. జిల్లాలో ఇంతవరకు అనుమానిత ఘటనలు చోటుచేసుకోలేదని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిబాబు తెలిపారు. వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కోడి మాంసం, గుడ్లను 70 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల: పట్టణంలోని ఎరుకలి పేట కాలనీకి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎరుకలి సుంకన్న, మంగమ్మ దంపతులు వృత్తి రీత్యా తాళ్లు అమ్మేందుకు శనివారం ప్యాపిలికి వెళ్లారు. వారు ఆదివారం ఉదయం స్థానిక గ్యాస్ ఏజెన్సీలో పని చేసే కుమారుడు సాయి కృష్ణ (26)కు ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో అనుమానంతో పక్కనే బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటి వద్దకు వెళ్లి ఎంత పిలిచినా స్పందించకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా సాయి కృష్ణ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు తీవ్ర గాయాలు

- తన వాహనంలో ఆసుపత్రికి తరలించిన డీఐజీ

కర్నూలు: ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో విధులు ముగించుకుని కర్నూలుకు వస్తున్న బాంబు డిస్పోజల్ టీమ్ సభ్యులు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు సీవీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవీ రామిరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారి మీద ద్విచక్రవాహనంపై కర్నూలుకు వస్తుండగా నన్నూరు టోల్‌ప్లాజా వద్ద గుర్తు తెలియని ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు అన్నమయ్య జిల్లాకు వెళ్లి ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న సమయంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదం చూసి తన వాహనాన్ని ఆపి గాయాలకు గురైన కానిస్టేబుల్‌ను స్వయంగా తన వాహనంలో ఎక్కించుకుని కర్నూలు మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదానికి కారుకుడైన ద్విచక్రవాహనదారుని కోసం ఓర్వకల్లు పోలీసులు గాలిస్తున్నారు.

అన్నపై తమ్ముడి దాడి

- పరిస్థితి విషమం


గాయపడిన తాహెర్‌వలీ

ఆదోనిరూరల్: మండలంలోని పాండవగల్ గ్రామానికి చెందిన తాహెర్‌వలీ అనే వ్యక్తిపై సొంత తమ్ముడే దాడి చేశాడు. దీంతో తాహెర్‌వలీ పరిస్థితి విషమంగా ఉంది. పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపిన వివరాల మేరకు.. పాండవగల్ గ్రామానికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొదటి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు కుమారులైన తాహెర్‌వలీ, దాదాహుసేన్ ఆస్తి కోసం తరుచూ గొడవలు పడేవారు. శనివారం అర్ధరాత్రి తాహెర్‌వలీ ఇంట్లో నిద్రిస్తుండగా తమ్ముడు దాదాహుసేన్ ఐరన్‌రాడ్‌తో దాడి చేశాడు. తాహెర్‌వలీకి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. తాహెర్‌వలీ తండ్రి ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రొటెక్షన్ వాచర్‌పై చిరుత దాడి

- యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన అజీమ్‌బాషా

మహానంది: అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న మహానందిలోని పార్వతీపురం కాలనీకి చెందిన అజీమ్‌బాషాపై చిరుతపులి దాడి చేసింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. నల్లమలలోని బైరేనీ సెక్షన్, లెపర్డ్ బేస్ క్యాంపులో ప్రొటెక్షన్ వాచర్‌గా అజీమ్ బాషా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉండగా చిరుతపులి దాడి చేయడంతో తల నుదురు, మెడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అజీమ్ బాషాను 108 వాహనం ఈఎంటీ రాజయ్య, పైలట్ దస్తగిరి వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అజీమ్ పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వారు తెలిపారు.

బంగారు పళ్లెం బహూకరణ


బంగారు పళ్లెంను బహూకరిస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి ఆదివారం చెన్నైకు చెందిన కోనేరు విమాలాదేవి, ఆమె కుటుంబ సభ్యులు బంగారు పళ్లెమును బహూకరించారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు ఈ విరాళాన్ని అందించారు. 343 గ్రాములతో ఈ బంగారు పళ్లెమును తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. విరాళాన్ని అందించిన దాతను దేవస్థాన తరపున స్వామివారి శేష వస్త్రాన్ని,లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు. మార్కండేయశాస్త్రి, సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణ, పర్యవేక్షకులు జి.స్వాములు పాల్గొన్నారు.

చౌడమ్మా.. దీవించమ్మా!

- వైభవంగా చౌడేశ్వరీ దేవి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలోచౌడేశ్వరీ దేవి

కోడుమూరు రూరల్: శ్రీచౌడేశ్వరీ దేవి తిరుణాల సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది. రథానికి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, కోడుమూరు ఎస్‌ఐ బాల నరసింహులు, దైవచార అటకార సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథంలో అమ్మవారి ఉత్సవమూర్తి అధిష్ఠింపజేసి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోడుమూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


అశేష జనవాహిని మధ్య సాగుతున్న రథోత్సవ దృశ్యం

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం


టీ షర్ట్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి జర్నలిస్టు టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జిల్లా జట్టుకు ఆదివారం గాయత్రీ ఎస్టేట్‌లోని ఆయన క్లినిక్‌లో టీ షర్ట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులకు కాస్త ఉపశమనం కోసం క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడి లేకుండా సమాజంలో ధైర్యంగా వార్త సేకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు సభ్యులు మోహన్, శివరాజ్‌కుమార్, వెంకటేష్, ప్రకాశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


చాందిని


చౌడేశ్వరి

కర్నూలు(సెంట్రల్): ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ 6వ జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులుగా ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన ఈ సభలు ముగియడంతో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా చాందిని, చౌడేశ్వరిని ఎన్నుకున్నారు. వారితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిల్ మెంబర్లను ఎన్నుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత, వేతనాలు పెంపుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలోఆయన మాట్లాడుతూ.. ఆశావర్కర్లు ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం పోరాటాలు చేస్తే అణచివేయడం అన్యాయమన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ వర్గాల ప్రజల ప్రయోజనం కోసం పనిచేస్తుండడంతో పోరాటాలు ముందుకు సాగడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అలాంటి రాజకీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపాల్, కాంతమ్మ పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తా


బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ చల్లా వాసురెడ్డి

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని డాక్టర్ చల్లా వాసురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ మున్సిపల్ కార్పొరేషన్ పార్కులో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన డాక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారులను క్రీడల పట్ల ప్రోత్సహించాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ క్రీడలు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన బి.నమ్రత, భువనేష్‌లకు ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ ఆదివారం తన కార్యాలయంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతుగా ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్, మల్లికార్జున బ్రహ్మకుమార్, బాషా, మహేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

కర్నూలు న్యూటౌన్: నగరంలోని రోజా వీధికి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పరిసాయి (24) దారుణ హత్యకు గురయ్యాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే ఈయన ఆదివారం అర్ధరాత్రి స్నేహితుడు పెద్దమూర్తితో కలిసి చిదంబరరావు వీధికి వెళ్లారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఉప్పరిసాయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర రక్తగాయాలైన పెద్దమూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుడితో మాట్లాడారు. మృతి చెందిన ఉప్పరిసాయి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎవరు దాడి చేశారు..ఎందుకు చేశారు తదితర పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు న్యాయం జరుగుతుంది
- నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక పెద్దమార్కెట్ రాయల్‌ఫంక్షన్ హాలులో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అధ్యక్షతన కర్నూలు నియోజకవర్గ పార్టీ ముఖ్యులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'పార్టీలో పనిచేసే ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. ఎలాంటి అపోహలు అవసరం లేదు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంచి అభిప్రాయం ఉంది. తప్పకుండా ఆయనకు న్యాయం జరుగుతుంద'ని చెప్పారు. హఫీజ్‌ఖాన్ ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉండి నగర అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అలాంటి నాయకుడిని పార్టీ వదులుకునేందుకు సిద్ధంగా లేదన్నారు. ఆయన సేవలను పార్టీ వినియోగించుకుంటుందన్నారు. కార్యకర్తలు, పార్టీ నాయకుల అభిప్రాయాలను, మనోభావాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానన్నారు.

ఇంటింటికీ సంక్షేమం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమం అందించిందని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ కృషి చేశారన్నారు. మరింత మంచి జరగడం కోసం వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. అనంతరం కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గ కార్యకర్తలు అధైర్య పడవద్దన్నారు. సీఎం వైఎస్ జగన్ తనకు న్యాయం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో మనందరం కలిసికట్టుగా పని చేసి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో- ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి

ముస్లింలపై టీడీపీ చిన్న చూపు

కర్నూలు(అర్బన్): తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ నెల 24వ తేదీన ప్రకటించిన అభ్యర్థుల తొలి జాబితాలో ముస్లిం మైనారిటీలకు ఒక్క సీటు మాత్రమే ప్రకటించి తీవ్ర అన్యాయం చేశారని ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రకటించిన జాబితాను చూస్తే ఆయా పార్టీలకు ముస్లిం మైనారిటీల పట్ల ఉన్న ప్రేమ ఏ పాటిదో అర్థమవుతోందన్నారు. జాబితాలో నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్ఎండీ ఫరూక్‌ను మాత్రమే ప్రకటించారన్నారు. జనసేన ప్రకటించిన 24 అసెంబ్లీ సీట్లలో తమ సామాజిక వర్గానికి చెందిన వారికి ఐదు సీట్లు కేటాయించారన్నారు. అసెంబ్లీలో తమ సంఖ్యా బలం లేకపోవడం వల్ల సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మైనారిటీలు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైన ముస్లిం మైనారిటీలు చైతన్యవంతమై జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించేలా ఆయా రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలన్నారు. అందులో భాగంగానే ఈ నెల 29న ఆదోనిలో ముస్లిం మైనారిటీల గర్జనను నిర్వహిస్తున్నామని పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం


మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్

కర్నూలు (టౌన్) : ప్రభువు యేసుక్రీస్తు మార్గం అనుసరణీయమని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో పర్ణశాలల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన అనేది మనిషిలోని దుర్గుణాలను రూపుమాపుతుందన్నారు. బ్రదర్ సాంసోనన్న మాట్లాడుతూ క్రైస్తవ సమాజ అభివృద్ధికి ఎస్వీ కుటుంబం ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రదర్ శ్యామ్ ఓవన్, బ్రదర్ యాకోబ్ బ్రదర్ దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు


వృద్ధులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాశ్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెలివ్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపత్రి మెడికేర్ క్లినిక్, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కర్నూలు గ్రేటర్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని గురురాఘవేంద్రనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంస్థ తరపున సహకారాన్ని అందిస్తామన్నారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అలంపూర్ సమీపంలోని ఇటిక్యాల గ్రామంలో జరిగిన వైద్య శిబిరంలో ఉచిత బీపీ, షుగర్ వ్యాధులకు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ఫరీదా, రాజేశ్వరి, సోమన్న, శ్రీనివాసులు, ఆర్ఎంపీ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'షబ్ ఏ బరాత్'


నగరంలో జిలేబీ విక్రయ సందడి

కర్నూలు (న్యూటౌన్): నగరంలో ఆదివారం షబ్ ఏ బరాత్ (బడీరాత్)ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాత్రి అన్ని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు, ప్రార్థనలు చేశారు. అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి చనిపోయిన తమ పూర్వికుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతబస్టాండు, కొత్త బస్టాండు, సీ క్యాంప్ సర్కిల్, బళ్లారి చౌరస్తాలో షబ్ ఏ బరాత్ సందర్భంగా రకరకాల జిలేబీలను తయారు చేసి విక్రయించారు.

క్షమాపణ కోరుకునే రాత్రి

ముస్లిం సోదరులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో నమాజ్‌లు, చదివి, దువా చేస్తూ తాము చేసిన పాపాలను క్షమించమని అల్లాహ్‌ను హృదయపూర్వకంగా ప్రార్థించే రోజు షబ్ ఏ బరాత్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం షబాన్ నెలలో 15వ తేదీని షబ్ ఏ బరాత్‌గా జరుపుకుంటారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవులందరి భవిష్యతుకు ఈ రాత్రే మార్గనిర్దేశం చేస్తారని ముస్లింల విశ్వాసం. అల్లాహ్ తన భక్తుల రిజ్క్(జీవనోపాధి)ని తదుపరి సంవత్సరానికి నిర్ణయిస్తాడని నమ్ముతారు.

దంత సంరక్షణపై దృష్టి సారించాలి


కర్నూలు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి దంతాలను పరీక్షిస్తున్న దంతవైద్యురాలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి ఒక్కరూ తమ దంతాల సంరక్షణపై దృష్టి సారించాలని డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ వై.శిరీషారెడ్డి అన్నారు. ఆదివారం సీ.క్యాంపు సెంటర్‌లోనికర్నూలు పెన్షనర్స్ అసోసియేషన్ కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా దంతవైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు ప్రారంభించగా డాక్టర్ వై.శిరీషారెడ్డి పెన్షనర్ల దంతాలను పరీక్షించి చికిత్స చేశారు. ఉచితంగా మందులు, మౌత్‌వాష్‌లు, టూత్‌పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, సబ్ ట్రెజరీ ఏటీవో రఘువీర్, ఎస్టీవో విక్రాంత్, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు రైతులకు మద్దతుగా స్కూటర్ ర్యాలీలు


సమావేశంలో మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): ఢిల్లీ సరిహద్దుల్లో పంటలకు కనీసమద్దతు ధర, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో నేడు స్కూటర్ ర్యాలీలు నిర్వహించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా నాయకులు ఎస్.మునెప్ప, జి.రామకృష్ణ, పీఎస్ రాధాకృష్ణ, నాగన్న, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ హాజరై స్కూటర్ ర్యాలీల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మద్దతు ధర అడిగిన ఐదు గురు రైతులను బీజేపీ ప్రభుత్వం కాల్చి చంపిందన్నారు. ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో రైతులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో స్కూటల్ ర్యాలీలు చేపట్టాలని కోరారు.

పరమ పావనం భగవద్గీత పఠనం


ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్


ప్రవచనం చెబుతున్న రఘునందన సేవక్ ప్రభు దాస్

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలని, దీని వల్ల పరమ పావనం చెందుతామని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు దాస్ అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉత్తమ జీవితానికి భగవద్గీత మార్గదర్శనం అన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రజారోగ్యవేదిక, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ల ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ శిబిరానికి దాదాపు 200మంది రోగులు వచ్చి మూర్ఛ, బీపీ,పక్షపాతం , షుగర్ పరీక్షలు నిర్వహించుకున్నారు. మెడికల్ కళాశాల రిటైర్డ్ సీఎంఓ ఎం.నాగభూషణ్‌రావు, ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డి.భరత్, జనరల్ ఫిజిషియన్‌లు డాక్టర్ టి.వినోద్, డాక్టర్ సుధాకర్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా వైస్ చైర్మన్ బి. రామాంజనేయులు, శిరీష, జేఎన్ శేషయ్య, రమంగస్వామి, బసయ్య, సుధాకరప్ప, హుస్సేనయ్య పాల్గొన్నారు.

దేశ ప్రధానిగా మరోసారి మోదీ కావాలి

కర్నూలు కల్చరల్: దేశ ప్రధానిగా మరోసారి మోదీని గెలిపించుకోవాలని లీగల్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మందా రాజ్యలక్ష్మి అన్నారు. ఇందుకోసం ఆమె తమిళనాడు నుంచి ప్రారంభించిన బైక్ ర్యాలీ ఆదివారం కర్నూలు చేరుకోవడంతో స్థానిక బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో భారత దేశం గురుస్థానాన్ని చేరుకోవాలంటే మోదీ మరోసారి ప్రధాన మంత్రి కావాలన్నారు. తను చేపట్టిన బైక్ యాత్ర ఏప్రిల్ 18వ తేదీన ఢిల్లీలో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు, రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ విజయలక్ష్మి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, జిల్లా నాయకులు మల్లికార్జున, జన సేన నాయకులు శ్రీనివాస్, ఈశ్వర్, నారాయణ స్వామి, గురుప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఆన్‌లైన్ కోర్సుల పేరుతో ఉన్నత విద్యాశాఖ ఎడెక్స్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో విద్యను ప్రైవేట్ పరం చేస్తోందన్నారు.

ఇసుక అక్రమ తరలింపు కేసులో నోటీసులు జారీ

కర్నూలు (న్యూటౌన్): ఫిబ్రవరి 21న కౌతాళం మండలం మరళి గ్రామ పరిధిలో అక్రమంగా ఇసుక తవ్వుతున్న కర్ణాటకకు చెందిన హిటాచీని సీజ్ చేసి నోటీసులు జారీ చేశామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తవ్వుతున్న హిటాచీని సీజ్ చేసి కౌతాళం పోలీస్ స్టేషన్‌లో పెట్టామన్నారు. హిటాచీ యజమాని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి గ్రామానికి చెందిన శరణబసవ అని విచారణలో తేలిందన్నారు. కర్ణాటక నుంచి ఏపీలోకి హిటాచీతో ప్రవేశించి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు నోటీసు జారీ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలోముగ్గురికి గాయాలు

ఓర్వకల్లు: నన్నూరు గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఏపీ03జెడ్ 5194 నంబరు గల ఆర్టీసీ బస్సు నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తుండగా నన్నూరు వద్ద టైరు పంక్చరై వ్యతిరేక దిశలో వస్తున్న పుల్లగుమ్మికి చెందిన ఏపీ39యూ0454 నంబర్ గల ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా ఉరుకుందమ్మ, వీరేష, రవికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

అలరించిన 'రాజుగారి గోచి' సాంఘిక నాటకం


నాటకంలో అలరించిన సన్నివేశాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో ప్రదర్శించిన గుంటూరు కళానికేతన్ వీరన్న పాలెం వారి 'రాజుగారి గోచి' సాంఘిక నాటకం అలరించింది. నారిపెద్ది నారాయణ రచించిన ఈనాటకానికి చిట్టినేని సాయిబాబు దర్శకత్వం వహించారు. అంతకు ముందు ప్రముఖ రంగస్థల కళాకారులు లొద్దిపల్లె అల్లాబక్ష్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత కలెక్టర్ జి. బలరామయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రంగస్థల ముద్దుబిడ్డ అల్లా బక్ష్ పద్య నాటకంలో రాయలసీమ ఖ్యాతిని ఆంధ్రప్రదేశ్ అంతటా చాటిన మహానటులు అన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, ఉపాధ్యక్షులు సీవీ రెడ్డి, సభ్యులు శేషయ్య, యాగంటీశ్వర ప్ప,, కళాకారులు హెచ్. చంద్రన్న, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి


మేనిఫెస్టో ప్రతులను ఆవిష్కరిస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కౌలు రైతుల ఇబ్బందులను గుర్తించి వారిని ఆదుకోవడానికి రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కౌలురైతులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో కౌలు రైతుల మేనిఫెస్టో పేరిట ముద్రించిన ప్రతులను ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వాటి ఆధారంగా పంట పెట్టుబడికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ విషయాలను మేనిఫెస్టోల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిమ్మయ్య, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యత


సదస్సులో సన్మానం పొందిన సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యత అని సాహితీ వేత్త డాక్టర్ బి.వి. స్వరూప్ సిన్హా అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా వారోత్సవాల్లో భాగంగా తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం బీక్యాంప్‌లోని కల్లూరు విశ్రాంత ఉద్యోగుల సేవా సమితి కార్యాలయంలో 'తెలుగు భాష ద్రోహుల్ని వెలివేద్దాం తెలుగు భాష పిపాశకుల్ని ప్రోత్సహిద్దాం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషపై మక్కువ పెరిగేలా యువతలో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వభాషల్లో తెలుగు వెలుగొందాలన్నారు. సమితి అధ్యక్షుడు చిన్నావుల వెంకటరాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో కవులు, రచయితలు ప్రతాపరెడ్డి, బెల్డోనా కృష్ణమూర్తి, శేషఫణి శర్మ, లక్ష్మీనారాయణ, నిర్మలాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చలపతి, నాగరాజు, తిమ్మారెడ్డి, మీసాల రఘు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల నుంచి అక్రమ వసూళ్లను ఆపాలి

కర్నూలు కల్చరల్: భక్తుల నుంచి అటవీ శాఖ అధికారులు చేస్తున్న అక్రమ వసూళ్లను ఆపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి నలమల్ల అటవీ మార్గంలో శ్రీశైలం వస్తున్న భక్తుల నుంచి అటవీ శాఖ వారు డబ్బులు వసూలు చేయడం దుర్మార్గ చర్య అన్నారు. సమావేశంలో బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఖాన్, బీజేపీ జిల్లా నాయకులు శ్రీరాములు యాదవ్, గోరంట్ల రామాంజనేయులు, లోకేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


దళిత బతుకుల ముఖ చిత్రం 'సాక'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: దళిత బతుకుల ముఖ చిత్రంగా 'సాక' కథల సంకలనం నిలుస్తుందని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'సాక' కథల పుస్తకాన్ని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూరా ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో తెలుగు రాష్ట్రాల్లోని దళిత రచయితలో 2022లో రాసిన కథలకు చోటిచ్చారు. ఈ సందర్భంగా విరసం నాయకులు పాణి మాట్లాడుతూ.. కథల్లో వివక్ష వివిధ రూపాల్లో కనబడుతుందన్నారు. సామాజిక అంతరాలను కథకులు స్పష్టంగా చెప్పారన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ మాట్లాడుతూ.. కథల్లో దళితుల వాస్తవ జీవితాలు కనబడతున్నాయన్నారు. కొన్ని కథలు కన్నీటి పర్యంతం అయ్యేలా ఉన్నాయన్నారు. ప్రముఖ కవి వెంకట కృష్ణ మాట్లాడుతూ.. దళిత సాహిత్యంలోనే కాక యావత్తు కథా సాహిత్యంలో 'సాక' సంకలనం భిన్నమైందన్నారు. ఇందులోని కథా వస్తువు అనేక చర్చలకు దారి తీస్తుందన్నారు. సంపాదకులు తప్పెట ఓదయ్య, ప్రముఖ కవి డాక్టర్ సిద్దెంకి యాదగిరి, రచయిత గుడిపల్లి నిరంజన్ మాట్లాడుతూ.. జంబూ సాహితీ పేరుతో 2020 నుంచి దళిత కథా సంకలనాలు తెస్తున్నామన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, కార్యక్రమ సమన్వయకర్త జంధ్యాల రఘుబాబు మాట్లాడారు. రచయిత ఇనాయతుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు, రచయితలు డాక్టర హరికిషన్, కల్యాణ దుర్గం స్వర్ణలత, అజీజ్, బసవరాజు, విజయులు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దాం

- 30వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ జయన్న 100 మంది అనుచరులతో పార్టీలో చేరిక
- పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాటసాని


పాణ్యం ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు

కర్నూలు (న్యూటౌన్): ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి పాణ్యం నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కల్లూరు అర్బన్‌లోని షరీన్‌నగర్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన 30వ వార్డు ఇన్‌చార్జ్ జయన్నతో పాటు 100 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా, ఇంటి వద్దకే రావాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరిన జయన్న తదితరులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, కల్లూరు సహకార సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రమణారెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమలత, తిరుపాలు, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.